క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

బెజ్జూర్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు గురువారం మండలంలో పర్యటించనున్నట్లు మాజీ ఎంపీపీ కొండ్ర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కుకుడ, 11 గంటలకు కృష్ణపల్లి, మధ్యాహ్నం 12 గంటలకు ఎల్కపల్లి, ఒంటి గంటకు సిద్దాపూర్ గ్రామాల్లో నిర్వహించనున్న పలు కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

ఉపాధ్యాయులు తరగతి గదుల్లో ఫోన్‌లు వాడొద్దు


మాట్లాడుతున్న ఎంఈవో సుధాకర్

కెరమెరి: తరగతి గదుల్లో సెల్‌ఫోన్‌లు వాడొద్దని ఎంఈవో కుడ్మెత సుధాకర్, ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. టీచర్లు సమయ పాలన పాటించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, మరోసారి పునరావృతం కాకుండా చూడాలన్నారు. రికార్డులు సరైన విధంగా నమోదు చేయాలన్నారు. కెరమెరి కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఎస్సీఆర్‌పీలు శ్యాంరావు, నరేశ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

రెబ్బెన: తెలంగాణ గ్రామీణ బ్యాంకు గోలేటి శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అమీన్‌గూడలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అందజేస్తున్న సేవలు, అమలు చేస్తున్న పథకాలపై కళాకారులు మ్యాజిక్ షో, పాటల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం బ్రాంచి మేనేజర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్, క్యాషియర్ సురేశ్, బ్రాంచి సిబ్బంది ఇమ్రాన్, జనార్దన్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణలు పాల్గొన్నారు.


పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ నుంచి గన్నారం వెళ్లే మార్గంలో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఎండీ సాబీర్ సెల్‌ఫోన్ పోగొట్టుకొని ఫిర్యాదు చేయగా, బుధవారం ఈజీగాం ఎస్సై రామన్ కుమార్ గుర్తించి బాధితుడికి అప్పగించారు. సెల్‌ఫోన్‌ను ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబర్చిన పోలీస్ కానిస్టేబుల్ నయీంను ఎస్సై ప్రత్యేకంగా అభినందించారు.

ప్రమాణస్వీకారానికి చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: 1969 తెలంగాణ ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారానికి సత్వర చర్యలు తీసుకోవాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్త సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉద్యమకారున్ని గౌరవించి పదవి కట్టబెట్టడం సంతోషకర విషయమన్నారు. నాయకులు కలికోట రమణయ్య, నారాయణ, ఎల్లాగౌడ్, దేవయ్య, ఎఎస్ఆర్ మూర్తి, బంగారు బాబు, నాగేశ్వర్‌రావు, కోట రాజారాం పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న ఆర్డీవో సురేశ్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ డైరీ, పిలుపు మాసపత్రికను ఆర్డీవో సురేశ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు నారాయణ, ఎఎస్ఆర్‌మూర్తి, రమణయ్య, ఎల్లాగౌడ్, దేవయ్య, బంగారి బాబు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్ సీఐగా అంజయ్య


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ

జైనూర్: జైనూర్ సీఐగా అంజయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సురేశ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఐ అంజయ్య మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు.

పత్తి ధర పతనం


దహెగాంలోని ఓ ఇంటిలో నిల్వ ఉన్న పత్తి

- దిగాలు చెందుతున్న అన్నదాత
- ప్రస్తుతం సీసీఐలో ధర రూ.6920
- ప్రైవేటులో రూ.6500

దహెగాం: హలాలు పట్టి పొలాలు దున్ని పంటలను పండిస్తున్న అన్నదాతలకు వ్యవసాయం రానురాను భారంగా మారుతోంది. అతివృష్టి, అనావృష్టి వల్ల ఏటా పంట నష్టం జరుగుతోంది. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు. గత ఏడాది పత్తి క్వింటాల్‌కు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు పలికింది. ఈ ఏడాది సీసీఐలో రూ.7020 మాత్రమే ఉండగా 20 రోజుల క్రితం క్వింటాలుకు రూ.100లు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటులో రూ.6,500 నుంచి రూ.6,700లకు మించడం లేదు. ధర పెరుగుతుందని ఇళ్లల్లో పత్తి నిల్వ చేసుకున్నా ధర తగ్గుతుండడంతో అన్నదాతలు అయోమయంలో పడ్డారు.

22వేల ఎకరాల్లో సాగు..

ఈ ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా 22వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గత రెండు సంవత్సరాలుగా పెద్దవాగు, ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో సాగు చేసిన పంటలు వరద తాకిడికి నీట మునగడంతో పాటు కొట్టుకుపోయాయి. దీంతో పరీవాహకప్రాంతాల్లో ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గింది. వాగుల పరీవాహక ప్రాంత భూముల్లో ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. పత్తి సాగు చేస్తున్న రైతులు పెట్టుబడులు పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది.

సీసీఐ మూసేస్తారని వదంతులు..

రైతులు పత్తిని అధికంగా సీసీఐలోనే విక్రయిస్తున్నారు. సీసీఐకి పత్తి పోటెత్తడం, పత్తి నిల్వలు పేరుకుపోవడం, బేల్స్ తరలించకపోవడంతో సీసీఐని మూసివేస్తారని పుకార్లు లేచాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లల్లో నిల్వ ఉంచిన పత్తిని తరలించడానికి తంటాలు పడుతున్నారు. వాహనాల కొరత సైతం ఏర్పడుతుంది. అయితే సీసీఐని మూసివేస్తారని అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. పత్తి నిల్వలు పేరుకుపోవడంతో తాత్కాలికంగా అప్పుడప్పుడు కొనుగోళ్లు నిలిపివేస్తున్నామని, సీసీఐ పూర్తిగా మూసివేయడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

పెరిగిన ఖర్చులు..

పత్తి విత్తుకున్నప్పటి నుంచి చేతికొచ్చే దాకా రైతుకు ఖర్చులు భారమవుతున్నాయి. పత్తి తీయడానికి, అమ్మడానికి సైతం భారీగా ఖర్చవుతోంది. వరినాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నందున పత్తి తీయడానికి కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు పత్తి తీసేందుకు కూలీలకు ఎక్కువ చెల్లించాల్సి వస్తుంది. కిలో పత్తి తీయడానికి రూ.15 చెల్లిస్తున్నారు. క్వింటాల్‌కు వచ్చే ఖర్చు రూ.1,500 కాగా, పత్తి అమ్మడానికి, తరలించడానికి క్వింటాల్‌కు రూ.120 చెల్లిస్తున్నారు. అదే వాహనాల్లో లోడ్ చేయడానికి కూలీలు క్వింటాలుకు రూ.100 తీసుకుంటున్నారు. దీంతో 10 క్వింటాళ్ల పత్తికి అయ్యే ఖర్చు రూ.3,700 వరకు వస్తుంది. అది కేవలం పంట చేతికొచ్చే సమయంలో అయ్యే ఖర్చు మాత్రమే. కాగా ప్రభుత్వం రాయితీలు కల్పించక పోవడంతో పెట్టుబడులు పెరిగాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏటా నష్టం..



తీసిన పత్తి అమ్ముదామంటే ధర లేదు. సీసీఐలో పత్తి ధర రూ.100 దిగింది. సీసీఐ మూస్తారని పుకార్లు వస్తున్నాయి. ఉన్న పత్తిని అమ్మడానికి బండ్లు దొరుకుతలేవు. ప్రైవేటులో అమ్మితే రూ.6200 పెడతామంటున్నారు. ఏటా పత్తి సాగు చేసి నష్టపోతున్నాం.

– కుడె లచ్చన్న, రైతు, ఒడ్డుగూడ

ధర పెరగడం లేదు..



గత ఏడాది పత్తికి మంచి ధర ఉండే. ఈసారి కూడా ధర పెరుగుతుందని పత్తిని ఉంచిన. ధర పెరగక పోవడంతో సీసీఐలో నెల రోజుల కింద 100 క్వింటాళ్ల పత్తి రూ.7000లకు అమ్మినా. ఇంకా 30 క్వింటాళ్ల దాక పత్తి ఇంట్లోనే ఉంది. క్వింటాలుకు రూ.100 దిగింది. ప్రైవేటులో పత్తికి గిట్టుబాటు ధర కూడా వస్తలేదు.

– బొర్కుట్ సత్యన్న, రైతు, ఐనం

రాయితాడ్.. జంగుబాయి

- ధనోరాలో నేటి నుంచి ఉత్సవాలు
- నేడు రాత్రి దీపోత్సవం


ఆలయంలో కొలువైన దేవతా విగ్రహాలు

కెరమెరి: తెలంగాణ –మహారాష్ట్ర సరిహద్దులోని మహరాజ్‌గూడ అడవుల్లో బస చేసిన జంగుబాయి ఉత్సవాలు పుష్యమాసంలో ప్రారంభం కాగా, మండలంలోని ధనోరా గ్రామంలో పుష్యమాసం చివరి వారంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఏటా జరిగే ఉత్సవాలకు భిన్నంగా ఈసారి అత్యంత ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కొలాం ఆదివాసీలు ఇక్కడ పూజలు నిర్వహించనున్నారు.

ఉత్సవాలకు వందేళ్ల చరిత్ర

మండలంలోని ధనోరా గ్రామంలో నేటి నుంచి నిర్వహించే జంగుబాయి ఆలయ వార్షికోత్సవాలకు వందేళ్ల చరిత్ర ఉంది. పూర్వీకులు చెబుతున్న ప్రకారం.. ముక్కిలొంక, పార్డా గ్రామానికి చెందిన ఆత్రం లచ్చు జంగుబాయి భక్తుడు. ఆయన కలలో వచ్చిన దేవత తనను తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో పూజిస్తే సుఖశాంతులు కలుగుతాయని చెప్పింది. దీంతో భక్తుడు వందేళ్ల క్రితమే జంగుబాయి గుహలో వెలిగించిన దీపాన్ని తీసుకొచ్చి ఇక్కడ ఉత్సవాలు నిర్వహించాడని చెబుతుంటారు. అప్పటి నుంచి పుష్యమాసం చివరి వారంలో దీపారాధన ప్రారంభించి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 8 గంటలకు దీపోత్సవం జరుపనున్నారు. రాత్రంతా కొలాం ఆదివాసీలు అమ్మకు ప్రత్యేక పూజలు చేస్తారు. సంప్రదాయబద్ధంగా నృత్యాలు, భజనలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఆత్రం గోత్రం వారికి చెందిన జెండా ఎగురవేస్తారు. సమాధులకు పూజలు చేస్తారు. జంగుబాయి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని కెరమెరి, వాంకిడి, తిర్యాణి, ఆసిఫాబాద్, ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లితో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలిరానున్నారు. మహారాష్ట్రలోని జివితి, అంభేఝరి, సేడ్‌వాహి తదితర గ్రామాలకు చెందిన కొలాం ఆదివాసీ భక్తులు భారీగా తరలిరానున్నారు.

కోరికలు నెరవేరుతాయి



రాయితాడ్ జంగుబాయి దేవతను మనస్సుతో పూజిస్తే సకల కార్యాలు నెరవేరుతాయి. ప్రతీ ఏడాది ఆత్రం వంశస్తులు జంగుబాయి దేవతను ఇక్కడి గుడిలో పూజిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మను పూజిస్తే కోరికలు నెరవేరుతాయి.

– గంగు పటేల్, ధనోరా కొలంగూడ

సర్పంచుల పనితీరు అభినందనీయం


కెరమెరి: సర్పంచ్‌లను సత్కరిస్తున్న నాయకులు


దహెగాం: సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కెరమెరి: గడిచిన ఐదేళ్ల కాలంలో సర్పంచుల పనితీరు అభినందనీయమని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. సర్పంచుల ఐదేళ్ల పదవీకాలం బుధవారం ముగియడంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా 31 మంది సర్పంచులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో మహేందర్, అధికారులు ఉన్నారు.

దహెగాం: సర్పంచుల పదవీకాలం బుధవారం ముగియడంతో మండల సర్పంచులకు సన్మాన కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ కంబగోని సులోచన, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావుల ఆధ్వర్యంలో మండలంలోని 24 గ్రామ పంచాయతీల సర్పంచులను పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మండల రైతు సమన్వయ సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ సురేశ్, ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ దుర్గం రాజన్న, పాలకవర్గ సభ్యులను బుధవారం గ్రామస్తులు సన్మానించారు. ఎంపీడీవో గంగాసింగ్ మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో పంచాయతీ పాలకవర్గ సభ్యుల పనితీరు అమోఘమన్నారు. లోడుపల్లి, కొండపల్లి, అగర్‌గూడ సర్పంచ్‌లు శ్రీనివాస్, సంజీవ్, సుధాకర్, ఉపసర్పంచ్ సంధ్యారాణి, కోఆప్షన్ సభ్యుడు సాజీద్, మండల నాయకులు చౌదరి తిరుపతి, సముద్రాల రాజన్న, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోయవాగు గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని బుధవారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు ఆధ్వర్యంలో సన్మానించారు. సర్పంచ్ చింతపురి లక్ష్మి, ఉపసర్పంచ్ రాజు, వార్డు సభ్యులతో పాటు గ్రామ కార్యదర్శి సుష్మితలను సన్మానించారు.

తిర్యాణి: సర్పంచుల పదవీకాలం ముగుస్తుండటంతో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులకు అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానం చేశారు. ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ కోవ పార్వతి, ఎంపీవో జావిద్, సర్పంచులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్‌ల కృషి మరువలేనిదని మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లన్న అన్నారు. బుధవారం మండలంలోని గుండి గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించారు. సర్పంచ్ అరుణ, రవీందర్, ఏఎంసీ డైరెక్టర్లు శ్యాంరావు, పోషన్న ఉన్నారు.

జైనూర్: గ్రామ పంచాయతీ సర్పంచులను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, ఎంపీడీవో ప్రభుదయలు సన్మానించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచుల పదవీ కాలం ముగుస్తుండడంతో సర్పంచులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ పాల్గొన్నారు.

గరం గరంగా సర్వసభ్య సమావేశం


సమావేశంలో సెల్‌ఫోన్‌లో నిమగ్నమైన అధికారులు

తిర్యాణి: మండలంలోని ప్రజాసమస్యలను ఎన్నిసార్లు సభ దృష్టికి తీసుకొచ్చిన అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు సభ్యులు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కొటగాం సర్పంచ్ కోట్నాక గణపతి మాట్లాడుతూ తాటిగూడ, కొటగాం, గీసిగూడ గ్రామాల్లో కర్ర విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారయని, సిమెంట్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఐదేళ్లుగా తెలియజేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మండల కేంద్రంలో మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టడంతో పాటు నేటికీ అసంపూర్తిగా ఉన్న శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టాలని గడలపెల్లి ఎంపీటీసీ సార రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంచిర్యాల నుంచి మండల కేంద్రానికి బస్సు సర్వీసులను పెంచడంతో పాటు స్థానిక ప్రభుత్వాసుపత్రి వరకు బస్సు నడిపించాలని పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. కాగా సమావేశం జరుగుతుండగా అధికారులు తమకు సభతో సంబంధం లేదన్నట్లుగా తమ సెల్‌ఫోన్‌లలో మునిగిపోయారు. సమావేశంలో జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, వైస్‌ఎంపీపీ కోవ పార్వతి, ఎంపీటీసీ బుర్ర రాజ్యలక్ష్మి, లక్ష్మీబాయి, ఎంపీవో జావిద్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పదవీ విరమణ కార్మికులకు సన్మానం


సన్మానిస్తున్న జీఎం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో పదవీ విరమణ పొందిన కార్మికులను బుధవారం అధికారులు, కార్మికులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో ఈపీ హెల్పర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన పర్సె వెంకటస్వామి దంపతులను ఓసీపీ ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్‌లు సన్మానించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం పర్సనల్ డిపార్టుమెంట్ ఆఫీస్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన శ్యాం సుందర్‌పాండేను ఏరియా జీఎం రవిప్రసాద్ సన్మానించారు. ఎస్వోటూజీఎం నరేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, పర్సనల్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

అమ్మ ఆలయానికి మరిన్ని నిధులు

- రాజురా ఎమ్మెల్యే సుభాష్ ధోటే
- 'జంగుబాయి'కి ప్రత్యేక పూజలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్ ధోటే

కెరమెరి(ఆసిఫాబాద్): జంగుబాయి అమ్మవారి ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేస్తామని మహారాష్ట్రలోని రాజురా ఎమ్మెల్యే సుభాష్ ధోటే తెలిపారు. కెరమెరి మండలం మహరాజ్‌గూడ అటవీ ప్రాంతంలో కొలువైన జంగుబాయి అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. రావుడ్, మైసమ్మ, పోచమ్మ దేవతలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రెండు రాష్ట్రాలకు చెందిన ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఇప్పటివరకు ఆలయ అభివృద్ధికి కోసం రూ.5కోట్లతో వంతెన, రూ.30లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, రూ.2కోట్లతో మహరాజ్‌గూడ నుంచి ఆలయం వరకు సీసీరోడ్డు వేశామని తెలిపారు. అలాగే టొప్లకస వద్ద పుణ్యస్నానాలు చేసేందుకు మెట్లు, అమ్మవారి గుహకు వెళ్లేందుకు మెట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ భవనం మంజూరు చేస్తామన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేను పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆలయ కమిటీ సభ్యులు జాకు, మరప బాజీరావు, సెడ్మకి శ్యాంరావు, వెట్టి జాకు, మండాడి దౌలత్‌రావు, మహారాష్ట్ర కమిటీ సభ్యులు చందు వెట్టి, సీతారాం, దివాకర్, శంకర్ తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ నిరసన


నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ మోతిరాం

కౌటాల: మండలంలోని కన్నెపల్లి ఎంపీటీసీ సభ్యులు దుర్గం మోతిరాం బుధవారం కౌటాల ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో కన్నెపల్లి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధి అయిన తనను అధికారులు పిలువలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నిరసనలో బీఎస్పీ నాయకులు బందురావు, గోవింద్‌రావు, నాగయ్య, వెంకటేశ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం


తుమ్మిడి హెట్టిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కౌటాల: గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యమని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మిడి హెట్టి, కన్నెపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం ఐటీడీఏ నిధులతో వీపీనగర్ నుంచి జనగాం వరకు కన్నెపల్లి నుంచి ఎడ్లగూడ వరకు రూ.3.40 కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మిస్తుందన్నారు. గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వార్ధా వద్ద ప్రాజెక్టు నిర్మించి నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కన్నెపల్లి చెరువును కాలువలు నిర్మించి స్థానిక రైతులకు సాగునీరు అందిస్తామని తెలిపారు. నియోజకవర్గానికి మంజూరైన రూ.9 కోట్ల నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ చరణ్‌దాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు వానుపటేల్, మాజీ జెడ్పీటీసీ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు సందీప్, సాయి, నాయకులు సత్తయ్య, చందు, మధుకర్, మిథున్, రవి, తిరుపతి, విజయ్, శ్యామల, భీంరావు, శ్యాంరావు, వసంత్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్తు

కౌటాల: ఉన్నత చదువుతోనే భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో కేవలం చదువుపైనే దృష్టి సారించాలని, రానున్న వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోగా కళాశాల నూతన భవనంను అందుబాటులోకి తేస్తామన్నారు. కౌటాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షులు వానుపటేల్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఎల్కులే మల్లయ్య, నాయకులు సత్తయ్య, చందు, మధుకర్, మిథున్, రవి, తిరుపతిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ యువ సంఘం ఆధ్వర్యంలో డీఐఈవో శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఓ కళాశాల ఇంటర్, డిగ్రీ విద్యార్థులను ఒకే భవనంలో నిర్వహిస్తుందని ఆరోపించారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఫిబ్రవరి 3న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి తిరుపతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చలో ఢిల్లీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. పీడీఎస్‌యూ నాయకులు శిరీష, హర్షిత, అంజలి, జశ్వంత్ పాల్గొన్నారు.

సెలవుదినంగా ప్రకటించాలి

లింగాపూర్: గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 15ను సెలవు దినంగా ప్రకటించాలని జిల్లా బంజార యువసేన ఉపాధ్యక్షుడు ఆడే సురేశ్ నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపల్లిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

అతివేగం ప్రమాదకరం

కౌటాల: వాహనాలను అతివేగంగా నడిపి ప్రమాదాల బారిన పడొద్దని ఎస్సై ఎన్.మధుకర్ అన్నారు. బుధవారం మండలంలోని బోదంపల్లి గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కౌటాల –బెజ్జూర్ ప్రధాన రహదారిపై మూలమలుపు వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి

రెబ్బెన: ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించటమే లక్ష్యంగా రూంటూ రీడ్ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని పులికుంట కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వర్క్‌బుక్కులు, పుస్తకాలు అందజేశారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

వాంకిడి: మండలంలోని ఇందాని, బెండార పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్ వ్యాధి నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీఎంకు సమ్మె నోటీసు అందజేత

రెబ్బెన: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన సమ్మెకు సంబంధించిన నోటీసును బుధవారం కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు ఏరియా జీఎం రవిప్రసాద్‌కు అందజేశారు. నాయకులు ప్రవీణ్, కృష్ణ, తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.

జంతువులను సంరక్షించుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: జంతువులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేశ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలుర, జన్కాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి జంతు సంక్షేమ పక్షోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జంతువుల ప్రాధాన్యతపై వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు సుభాష్, ఉదయ్‌బాబు, పశు వైద్యాధికారి మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీటీంలు

రెబ్బెన: బాలికలు, మహిళల రక్షణ కోసమే షీటీంలు పని చేస్తున్నాయని ఆసిఫాబాద్ షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. ఎస్పీ సురేశ్‌కుమార్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఆదేశాల మేరకు మండలంలోని నవేగాం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం షీటీం సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాధితులు 8712670564ను సంప్రదిస్తే ఆసిఫాబాద్ షీటీం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

తట్టలు పంపిణీ

కెరమెరి: మండలంలోని ఖైరీ గ్రామంలో పని చేస్తున్న ఉపాధిహామి కూలీలకు బుధవారం మాలి సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ డివిజన్ కార్యదర్శి బాలాజి తట్టలు పంపిణీ చేశారు. ఉపాధి పని పేద కూలీలకు పని చేసే చోట తట్టలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.